www.prajasakti.com

ప్రజాశక్తి

గురువారం 4 జనవరి 2024

5

తూర్పుగోదావరి



కార్టూనిస్ట్ శేఖర్‌కు తృతీయ బహుమతి



ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

ప్రముఖ హాస్యపత్రిక హాస్యానందం సహకారంతో గుళ్లపల్లి అరుణకుమారి స్మారక జాతీయ స్థాయి కార్టూన్ల పోటీల్లో రాజమహేంద్రవరానికి చెందిన ప్రముఖ సీనియర్ కార్టూనిస్ట్ శేఖర్‌కు తృతీయ బహుమతి లభించింది. ఈ నెల 26న విజయవాడలోని 'బాలోత్సవ భవన్'లో జరిగే కార్యక్రమంలో ఆయనకు నగదు బహుమతి, ప్రశంసాపత్రం అందించనున్నారు. ఈ సందర్భంగా కార్టునిస్ట్ శేఖర్‌ను అతిథుల చేతుల మీదుగా సత్కరిస్తామని పోటీల నిర్వాహకులు జిసి.పద్మదాస్ తెలిపారు. ఈ సందర్భంగా నగరంలోని పలువురు సాహితీ వేత్తలు, కళాకారులు శేఖర్‌కు అభినందనలు తెలిపారు.

దద్దరిల్లిన కలెక్టరేట్

- బెదిరింపులతో ఉద్యమాన్ని ఆపలేరు
- ప్రభుత్వానికి గుణపాఠం తప్పదు
- అంగన్‌వాడీల ధర్నాలో నేతల హెచ్చరిక


కలెక్టరేట్ వద్ద బైటాయించిన అంగన్‌వాడీలు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

జిల్లా కలెక్టరేట్ అంగన్‌వాడీల నినాదాలతో దద్దరిల్లింది. అంగన్‌వాడీల పట్ల రాష్ట్ర ప్రభుత్వం బెదిరింపులు మానుకోవాలని, ఇదే పంథాలో జగన్ సర్కార్ ముందుకు వెళ్లితే రాబోయే రోజుల్లో తగిన గుణపాఠం తప్పదని వక్తలు హెచ్చరించారు. ఏపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఇచ్చిన పిలుపులో భాగంగా బుధవారం జిల్లావ్యాప్తంగా ఉన్న అంగన్‌వాడీలు, ఆయాలు కలెక్టరేట్‌కు నల్లని దుస్తులు ధరించి ప్రభుత్వ తీరును నిరసించారు. అంగన్‌వాడీల ఉద్యమంలో పిడిఎఫ్ ఎంఎల్‌సి ఇళ్ల వెంకటేశ్వరరావు(ఐవి) పాల్గొని మాట్లాడారు. ఎన్నికల ముందు పాదయాత్రలో జగన్ అంగన్‌వాడీలకు ఇచ్చిన వేతనాల పెంపు హామీని అమలు చేయమంటే వారిని వేధింపులకు గురిచేయడం ఎంతవరకు సబబు అని ప్రశ్నించారు. మాట తప్పను మడమ తిప్పను అనే జగన్ హామీలు నెరవేర్చడంలో మాట తప్పి మడమ తిప్పారని ఎద్దేవా చేశారు. జగన్ ప్రభుత్వానికి నవరత్నాలు తప్ప వేరే రత్నం లేదని, జగన్‌ను నమ్మి ప్రజలు ఓట్లు వేసి 151 ఎంఎల్‌ఎలను గెలిపించారని, ఆ ఓట్లు వేసిన ప్రజల్లో స్కీం వర్కర్లు, కార్మికులు, ఉద్యోగులు ఉన్నారనే విషయాన్ని మరచి అధికారంలోకి వచ్చాక వారికే తీరని అన్యాయం చేస్తున్నారని దుయ్యబట్టారు. సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు వేము ఉమామహేశ్వర రావు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 23 రోజులుగా లక్ష మందికి పైగా అంగన్‌వాడీలు ఆందోళనలు చేస్తున్నారని, అయితే అంగన్‌వాడీలతో మాట్లాడే సమయం ముఖ్యమంత్రికి లేకపోవడం బాధాకరమని అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి తక్షణమే అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలని, లేదంటే గద్దె దిగాలని అన్నారు. గడిచిన 30 ఏళ్లలో సిఐటియు నీడన అంగన్‌వాడీలు చేసిన పోరాటాల చరిత్రను గుర్తు చేసుకుంటే మంచిదని సలహా ఇచ్చారు. నెలకు రూ.75ల వేతనం నుంచి ప్రస్తుతం రూ.11,500 వేతనం పొందారు అంటే ఎర్రజెండా నీడలో అంగన్‌వాడీలు చేసిన పోరాటం ఫలితమేనని అన్నారు. అంగన్‌వాడీలను వేధింపులకు గురిచేసిన ఏ ముఖ్యమంత్రి తిరిగి అధికారంలోకి రాలేదని గుర్తుంచుకోవాలని హెచ్చరించారు. ఎన్నికల ముందు ప్రతిపక్ష నేతగా పాదయాత్రలో అక్క, చెల్లెమ్మలు అంటూ నెత్తిన చేయి పెట్టారని, తీరా అధికారం వస్తే అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీలు ఏ ఒక్కటి అమలు చేయలేదన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్ మాట్లాడుతూ అంగన్‌వాడీల న్యాయమైన డిమాండ్ల పట్ల సానుకూలంగా స్పందించాల్సిన రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీలను రెచ్చగొట్టే చర్యలకు పాల్పడటం దుర్మార్గమని అన్నారు. ఇదే పంథాతో ప్రభుత్వం అడుగులు వేస్తే అంగన్‌వాడీలు జగన్ సర్కార్‌కు తగిన గుణపాఠం తప్పక చెబుతారని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంఎల్‌సి ఆదిరెడ్డి అప్పారావు, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శి సిహెచ్.మాణిక్యాంబ, కె.బేబీ రాణి, సిఐటియు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎం. సుందరబాబు, బి.రాజులోవ, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎస్.ఎస్.మూర్తి, కెవిపిఎస్ రామచంద్రరావు, ఎస్ భగత్, కె.రామకృష్ణ, గంటి.కృష్ణ, కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి జువ్వల.రాంబాబు, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు, కార్యదర్శులు భాస్కర్, ఎన్.రాజా, అంగన్‌వాడీ యూనియన్ నాయకులు బి.మార్త, ఎం.మార్త, మాలతి, సునీత, శారద, పుష్ప, దుర్గాంబ, ప్రాజెక్ట్ లీడర్లు మరియు సెక్టర్ లీడర్లు, అంగన్‌వాడీలు, ఆయాలు పాల్గొన్నారు.


ధర్నాలోమాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఉమామహేశ్వరరావు, ఎంఎల్‌సి ఐవి, సిపిఎం జిల్లా కార్యదర్శి అరుణ్


చంటిపిల్లలతో ఎండలోనే ధర్నాలో కూర్చొన్న అంగన్‌వాడీలు



ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డికి జ్ఞాపికను అందిస్తున్న మంత్రులు, అధికారులు

నిరాశ పరిచిన సిఎం పర్యటన

- జిల్లా సమస్యలను ప్రస్తావించని వైనం
- సిఎం ప్రసంగంపై అసంతృప్తి

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

కాకినాడలో బుధవారం జరిగిన సిఎం పర్యటన ఉమ్మడి జిల్లా ప్రజలను నిరాశపరిచింది. ఎలాంటి హామీలు లేకుండా చప్పగా సాగింది. ప్రజా సమస్యలపై అసలు ప్రస్తావన రాలేదు. సమ్మెలో ఉన్న కార్మికుల ఊసే లేదు. కనీసం జిల్లా సమస్యలు, వాటికి పరిష్కార మార్గాలను కూడా జగన్ ప్రస్తావించలేదు. కేవలం ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించడానికే, ప్రతిపక్షాలను ఎండగట్టడానికే ఆయన ప్రసంగం పరిమితమైంది.

ఎన్నికలు మరో మూడు నెలలు మాత్రమే ఉన్నాయి. ఈ సారైనా జిల్లా ప్రధాన సమస్యలను ప్రస్తావిస్తారని, వాటి పరిష్కారానికి మార్గం చూపుతారని అంతా ఆశించారు. దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారానికి మార్గం సుగమం అవుతుందని చాలామంది అంచనా వేశారు. జిల్లా కేంద్రంలో సాగిన పర్యటన ద్వారా ప్రజా సమస్యలకు పెద్దపీట వేస్తారని అంచనాలు కూడా వినిపించాయి. కాని అవన్నీ ప్రస్తావనకు రాలేదు. కేవలం 45 నిముషాల మాత్రమే ఆయన ప్రసంగించారు. పూర్తిగా వైసిపి పథకాల ప్రమోషన్‌కే ప్రాధాన్యతనిచ్చారు. కాకినాడ స్మార్ట్ సిటీ నిధులతో నిర్వహించిన పనులు చాలా వరకు పెండింగ్‌లో ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వాల్సిన వాటా నిధులను ఇవ్వలేదు. ఈ నిధులు విడుదల అంశంపై ఆయన పెదవి విప్పలేదు. సిటీ ఎంఎల్‌ఎ ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి కాకినాడ ప్రజల తాగునీటి అవసరాల కోసం రూ. 47 కోట్లు అడగగా దానికి మాత్రమే సిఎం సానుకూలంగా స్పందించారు. రోడ్లు అధ్వానంగా మారి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఏలేరు, సుద్దగడ్డ ఆధునికీకరణ మాట పూర్తిగా మరిచారు. రెండేళ్ల క్రితం గొల్లప్రోలులో జరిగిన కాపు నేస్తం సభలో పిఠాపురం, గొల్లప్రోలు మున్సిపాలిటీలకు రూ.40 కోట్లు నిధులు కేటాయిస్తున్నట్లు ప్రకటించారు. నేటికి ఆ హామీ అమలు కాలేదు. పర్యాటక అభివృద్ధిపై గానీ, కోటిపల్లి నరసాపురం రైల్వే లైన్ పనులకు రాష్ట్ర వాటా నిధులు విడుదల అంశంపై గాని, సబ్ ప్లాన్ ఏరియా సమస్యలపై గానీ సీఎం నోరు మెదపలేదు.

పరిమితికి మించి జనం తరలింపు

పెన్షన్ పెంపు కార్యక్రమానికి కాకినాడ సిటీ నుంచి పరిమితికి మించి జనాన్ని తరలించారు. ప్రభుత్వ అధికారులు, గ్రామ, వార్డు సచివాలయాలు ఉద్యోగులు తెల్లవారుజాము నుంచే జనాన్ని తరలించే పనిలో నిమగ్నమయ్యారు. సభా ప్రాంగణంలోకి కిక్కిరిసి జనాన్ని పంపించగా అనేకమంది ఆర్ఎంసి గ్రౌండ్ బయటే ఉండిపోయారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగే అవకాశం ఉన్నందున పోలీసులు ఎక్కడికక్కడ ఆంక్షలు కఠినతరం చేశారు. దాంతో అనేకమంది సీఎం రాకముందే ఇళ్లకు వెను తిరిగారు.

రూ.109 కోట్ల అభివద్ధి పనులు ప్రారంభం

సభా వేదిక వద్ద కాకినాడ నగరంలో రూ.109 కోట్లతో చేపట్టిన పనులకు సంబంధించి శిలాఫలకాలను సిఎం ఆవిష్కరించారు.. రూ.65 కోట్లతో నూతనంగా నిర్మించిన ముత్తా గోపాలకష్ణ వారధిని, వివేకానంద పార్కు ప్రాంగణంలో రూ.9.5 కోట్లతో నిర్మించిన స్కేటింగ్ రింక్‌ను, రూ.20 కోట్లతో నిర్మించిన కళాక్షేత్రాన్ని ప్రారంభించారు. కాకినాడ జిజిహెచ్ ట్రామా కేర్ విభాగంలో రూ.7.20 కోట్ల నిధులతో నూతనంగా ఏర్పాటు చేసిన కాథ్ లాబ్, ఐసియులను, రూ.7.50 కోట్ల నిధులతో కల్పించిన ట్రామా కేర్ వసతులను ఆయన ప్రారంభించారు.



జూదాలకు పాల్పడితే కఠిన చర్యలు

ప్రజాశక్తి - నల్లజర్ల

సంక్రాంతి పండుగ పేరుతో అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే ఖఠిన చర్యలు తప్పవని తహశీల్దార్ వి.కిషోర్ కుమార్ హెచ్చరించారు. బుధవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. జూదంతో కూడిన కోడి పందాలు, గుండాటలు, కోసాటలు, పేకాటలు, ఇతర మత్తు పానీయాలకు దూరంగా ఉండాలన్నారు. మండలంలో ఎక్కడైనా కోడి పందాలకు సంబంధించి బరులను ఏర్పాటు చేస్తే తక్షణమే వాటిని ధ్వంసం చేసి సంబంధిత భూ యజమానులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎలాంటి అసాంఘిక చర్యలకు ప్రజలు సహకరిం చవద్దని కోరారు.

పేదలకు అన్నదానం

ప్రజాశక్తి - నిడదవోలు

రిటైర్డ్ ఫైర్ ఆఫీసర్, నక్కా నారాయణ మూర్తి నాలుగో వర్ధంతి సందర్భంగా ఆయన కుమారుడు, కుమార్తె నక్కా రమేష్‌రాజు, నక్కా ఝాన్సీరాణి ఆధ్వర్యంలో పేదలకు అన్నదానం కార్య క్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఎస్ఆర్ సంజీవిని హెల్పింగ్ హాండ్స్, సత్య సాయి నిత్య అన్న సేవ పథకం ఆధ్వర్యంలో ప్రభుత్వాసుపత్రిలో రోగులకు అన్నదానం చేశారు.

ఉపాధ్యాయులపై అణిచివేత ధోరణి తగదు

- యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రసాద్


12 గంటల ధర్నాలో మాట్లాడుతున్న యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రసాద్

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

జీతాల చెల్లింపులో తాత్సారం చేస్తూ ఉద్దేశ్యపూర్వకంగానే ఉపాధ్యాయులపై ప్రభుత్వం అణిచివేతకు పాల్పడుతుందని యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెఎస్-ఎస్ ప్రసాద్ విమర్శించారు. ప్రతి నెల 1న జీతాలు, పిఆర్‌సి, డిఎలు, పిఎఫ్, ఎపిజిఎల్ఐ తదితర ఆర్థిక బకాయిల సాధనకై యుటిఎఫ్ తూర్పుగోదావరి జిల్లా శాఖ ఆధ్వర్యంలో 12 గంటల ఆందోళన కార్యక్రమం బుధవారం సబ్ కలెక్టర్ కార్యాలయం యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు పి.జయకర్ అధ్యక్షతన జరిగింది. ముందుగా భారతదేశ తొలి ఉపాధ్యాయిని సావిత్రిబాయి పూలే జయంతి వేడుకల సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రసాద్ మాట్లాడుతూ ఒకటో తేదీన జీతాలు ఇవ్వకుండా ప్రభుత్వం తాత్సాహారం చేస్తూ ఉపాధ్యాయులపై ఉద్దేశపూర్వకంగా కక్ష సాధింపు చర్యలకు పూనుకుంటుందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వేసిన 12వ పిఆర్‌సి కమిషన్ కంటి తుడుపు చర్యగా కనిపిస్తోందని, కమిషన్ నియమించిందే తప్ప ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. ప్రభుత్వం వెంటనే 12వ పిఆర్‌సి కార్యక్రమాలు మొదలు పెట్టాలని డిమాండ్ చేశారు. ఎవరైతే సిపిఎస్ రద్దుచేసి, ఒపిఎస్ అమలు చేయడానికి సమ్మతిస్తారో వారికే బాహాటంగా తమ మద్దతు ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్ర సిఎం తీసుకుంటున్న విధానాల వల్ల రాష్ట్ర ఆదాయం గణనీయంగా పెరిగిందని ఒకపక్క చెబుతున్న ప్రభుత్వం తమ బకాయిలు చెల్లించమంటే ఖజానాలో డబ్బులు లేవని ఆర్థికమంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఇకనైనా ప్రభుత్వం స్పందించకపోతే జనవరి 9, 10 తేదీల్లో విజయవాడలో 36 గంటల నిరసన కార్యక్రమం చేపడతామన్నారు.

నీరో చక్రవర్తిలా జగన్ పాలన

'రోమ్ నగరం తగులబడుతుంటే పిడేలు వాయించుకుంటూ కూర్చున్న నీరో చక్రవర్తిలా రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పాలన ఉంది' అని పిడిఎఫ్ ఎంఎల్‌సి ఐ.వెంకటేశ్వరరావు ధ్వజమెత్తారు. ఉపాధ్యాయ నిరసన కార్యక్రమంలో ఎంఎల్‌సి ఐవి మాట్లాడుతూ అంగన్‌వాడీలు, ఎస్ఎస్ఎ ఉద్యోగులు, మున్సిపల్ కార్మికులు, ఉపాధ్యాయులు తమకు రావలసిన బకాయిల గురించి, ఇచ్చిన హామీలను అమలు చేయాలని రోడ్డెక్కి పోరాటాలు చేస్తుంటే ఏమీ ఎరగనట్టు తాడేపల్లిలో కూర్చుని ముఖ్యమంత్రి 'ఆడుదాం ఆంధ్ర' అనడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. జగన్ ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాలన్నీ తుంగలోకి తొక్కారని అందుకే వేతనజీవులంతా 'పోరాడుదాం ఆంధ్ర' అంటూ పోరుబాట పట్టారని వెంకటేశ్వరరావు అన్నారు. యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు జయకర్ మాట్లాడుతూ ప్రభుత్వ అనాలోచిత విధానాలతో రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలు కుంటిపడుతున్నాయని, ఉపాధ్యాయులు యుటిఎఫ్ ఆందోళనలో పాల్గొని ప్రభుత్వ పాఠశాలలను పరిరక్షించుకోవడానికి ముందుకు రావాలని కోరారు. యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.షరీఫ్ మాట్లాడుతూ సిపిఎస్ రద్దు చేస్తానని ఎన్నికల ముందు వాగ్దానం చేసిన వైఎస్ జగన్ సిఎం ఐన తరువాత మాటతప్పి, మడమ తిప్పి సిపిఎస్ కంటే దారుణమైన జిపిఎస్‌ను అమల్లోకి తీసుకొచ్చి ఉపాధ్యాయులకు తీరని నష్టాన్ని చేకూర్చుతున్నారని విమర్శించారు. దీక్షా శిబిరాన్ని ప్రారంభించిన యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎన్.అరుణకుమారి మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయ, శ్రామిక వర్గాల ప్రయోజనాలను రాష్ట్ర ప్రభుత్వం అణగతొక్కుతోందన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు రాష్ట్ర ప్రభుత్వం రూ.18,094 కోట్లు బకాయి పడిందన్నారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా మహిళా అసోసియేట్ విజయ్ గౌరీ, జిల్లా ఆర్థిక కార్యదర్శి ఇవివిఎస్ఆర్.ప్రసాద్, కాకినాడ జిల్లా యుటిఎఫ్ అధ్యక్షులు నగేష్‌బాబు, తూర్పుగోదావరి జిల్లా యుటిఎఫ్ సంఘం గౌరవ అధ్యక్షులు శంకరుడు తదితరులు మాట్లాడారు. జిల్లా కార్యదర్శులు శ్రీమణి, కె.రమేష్ బాబు, పి.శ్రీనివాసమూర్తి తదితరులు పాల్గొన్నారు.


మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న కార్మికులు

మున్సిపల్ కార్మికుల ధర్నా

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

సమస్యలు పరిష్కరించాలంటూ మున్సిపల్ కార్మికులు రాజమహేంద్రవరం మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. తొలుత తాడితోటలోని అంబేద్కర్ విగ్రహం నుంచి కార్మికులు నగర పాలక సంస్థ కార్యాలయం వరకూ ర్యాలీ నిర్వహించారు. రెగ్యులర్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని నినదించారు. ఈ సందర్భంగా మున్సిపల్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షులు తాటిపాక మధు మాట్లాడుతూ పురపాలక శాఖా మంత్రి సురేష్‌తో రాష్ట్ర జెఎసి చేసిన చర్చయలు విఫలం అయ్యాయని, ప్రభుత్వం మొండిగా వ్యవహరించడం వల్లే కార్మికులు సమ్మెలోకి దిగారని అన్నారు. సమ్మెను ఆపాలనడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఈ ధర్నాలో టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఆదిరెడ్డి వాసు పాల్గొని కార్మికుల సమ్మెకు మద్దతు ప్రకటించారు. తక్షణమే మున్సిపల్ కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. ధర్నా చేస్తున్న కార్మికుల వద్దకు వచ్చిన నగర పాలక సంస్థ కమిషనర్ కె.దినేష్‌కుమార్ సమ్మెను విరమించి విధుల్లో చేరాలని కోరారు. కార్మికుల సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు వి.కొండలరావు, సింగిరెడ్డి వెంకటరమణ, ముత్యాల మురళీకృష్ణ, ఎపి రెల్లికుల సంక్షేమ సంఘం అధ్యక్షులు నీలపు వెంకటేశ్వరరావు, బి.తాతారావులు సంఘీభావం తెలిపారు.

మంగళగిరికి తరలిన ప్రజాప్రతినిధులు

ప్రజాశక్తి - ఉంగ్రాజవరం

రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం అధ్వర్యంలో మంగళ గిరిలో జరుగుతున్న సర్పంచ్‌ల సమావే శానికి మండ లం నుంచి సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, జడ్‌పి టిసిలు, మాజీ సర్పంచ్‌లు, వార్డు మెంబర్లు, కౌన్సి లర్లు సుమారు 150 మంది వరకూ కార్లలో ర్యాలీగా తరలివెళ్లారు. ఈ ర్యాలీని మాజీ ఎంఎల్‌ఎ బూరుగుపల్లి శేషారావు వేలివెన్నులో తన స్వగహం నుంచి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా పంచాయతీ వ్యవస్థను బ్రష్టు పట్టించిన రాష్ట్ర ప్రభుత్వాన్ని రాష్ట్రం నుంచి తరిమికొట్టేందుకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

టాస్క్‌ఫోర్స్ బృందం తనిఖీలు

ప్రజాశక్తి - నల్లజర్ల

ప్రజారోగ్య వ్యవస్థ పనితీరును నేరుగా పరిశీలించేందు కు వైద్య ఆరోగ్య శాఖ జిల్లా టాస్క్‌ఫోర్స్ ప్రత్యేక బృందం బుధవారం మండలంలోని ప్రకాశ రావు పాలెంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించిం ది. డిపిఎంఒ డాక్టర్ అభిషేక్ రెడ్డి ఆధ్వర్యంలో జిల్లా గణాంక అధికారి జె.కుమారస్వామి, డిపిహెచ్‌ఎన్ఒ వసంతలక్ష్మి, డిపిఒ సంధ్యారెడ్డి, డేటా మేనేజర్ రామకృష్ణతో కూడిన బృందం ప్రకాశరావుపాలెం గ్రామంలో ఉదయం నుంచి సాయంత్రం వరకూ పలు రకాలైన వైద్య సేవలు, ప్రజలకు ఏ విధంగా అందుతున్నాయో నిశితంగా పరిశీలించారు. పాఠశాల విద్యార్థులకు సంబంధించి వైద్య సేవలు అందుతున్న తీరును నేరుగా స్కూలుకు వెళ్లి పరిశీలన చేశారు. గర్భిణీల ఎంసిపి కార్డులు, చిన్న పిల్లల టీకాల రికార్డులు, 19 ఏళ్లలోపు పిల్లలకు హెచ్‌బిలు నిర్వహించి పాత రికార్డులు సరిపోల్చి చూశారు. వీరి వెంట నల్లజర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ తెల్లం గంగాధరరావు పాల్గొన్నారు.


రాజేశ్వరి రామకృష్ణన్‌కు ఘన నివాళి

ప్రజాశక్తి - చాగల్లు


నివాళులర్పిస్తున్న ప్రముఖులు

స్థానిక జైపూర్ సుగర్స్ ఫ్యాక్టరీ ఎండి రాజేశ్వరి రామకృష్ణన్‌కు ఘనంగా నివాళులర్పించారు. రాజేశ్వరి రామకృష్ణన్ సంస్మరణ సభ స్థానిక ఎస్‌విఆర్‌కె ఇంగ్లీషు మీడియం స్కూల్లో బుధవారం జరిగింది. ఈ సందర్భంగా పలువురు పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాజకీయ నాయకులు, అభిమానులు, కార్మికులు స్కూల్ ఇన్‌ఛార్జ్ ఆళ్ళ శివకుమార్, వి.వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



ఇసుక అక్రమ రవాణా

ఎస్ఎస్ఎ ఉద్యోగుల జలదీక్ష


పుష్కర ఘాట్ వద్ద ధర్నాలో ఎస్ఎస్ఎ ఉద్యోగులు(ఇన్‌సెట్‌లో జలదీక్ష చేస్తున్న ఉద్యోగులు)

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

తమను విద్యాశాఖలో విలీనం చేసి రెగ్యులర్ చేయాలని, హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సర్వశిక్షా ఉద్యోగులు చేపట్టిన సమ్మెలో భాగంగా బుధవారం పుష్కర ఘాట్ వద్ద గల గోదావరిలో జలదీక్షను చేపట్టారు. బుధవారం డిఇఒ కార్యాలయం వద్ద సమగ్ర శిక్ష కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (జెఎసి) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 15వ రోజు నిరవధిక సమ్మె దీక్ష జరిగింది. దీక్షా శిబిరం నుంచి పుష్కర ఘాట్ వరకూ ప్రదర్శనగా చేరుకున్న ఉద్యోగులు గోదావరిలో జలదీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ ప్రస్తుత పార్ట్ టైం విధానాన్ని రద్దుచేసి, ఫుల్ టైం కాంట్రాక్టు విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. అవుట్‌సోర్సింగ్ సిబ్బందిని, కాంట్రాక్ట్ పద్ధతిలోకి మార్చి, వేతనాలు పెంచి ప్రతీ నెల ఒకటవ తేదీన విడుదల చేయాలని కోరారు. సమగ్ర శిక్ష ఉద్యోగులు కోరుతున్న న్యాయపరమైన డిమాండ్లు సాధించే వరకు ఉద్యమాన్ని విరమించేది లేదనిజెఎసి నాయకులు ఎమ్.రఘునాథ్, డి.వంశీకృష్ణం రాజు, పి.దుర్గా ప్రసాద్, ఆర్.వెంకట్రాజు, మిరపరాజు, వెంకట్ స్పష్టం చేశారు. అనంతరం సబ్ కలెక్టర్ కార్యాలయానికి చేరకుని డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కార్యాలయ అధికారులకు అందించారు. ఈ కార్యక్రమాల్లో సమగ్రశిక్ష ఉద్యోగులు శ్రీదేవి, పెద్దిరాజు, ప్రియదర్శిని, స్వప్న ప్రియ, సుమలత, మహేశ్వరి, కొండలరావు, మునీశ్వరరావు, లక్ష్మణ్, చిన్న రామారావు, సతీష్, శ్రీనివాస్, రవి, ప్రసన్న, మోహిని, దుర్గ, బాబ్జి, ప్రవీణ, అరుణకుమార్, జగన్, తదితరులు పాల్గొన్నారు.

ఎల్ఐసి ఉద్యోగుల నిరసన



ఎల్ఐసి డివిజన్ కార్యాలయం వద్ద నిరసనలో మాట్లాడుతున్న కోదండరామ్

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

వేతన సవరణ చర్చలను తక్షణమే ప్రారంభించాలని డిమాండ్ చేస్తూ ఎల్ఐసి ఉద్యోగులు నిరసన వ్యక్తం చేశారు. భోజన విరామ సమయంలో బుధవారం డివిజనల్ కార్యాలయం వద్ద నిరసన కార్యమ్రాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డివిజన్ ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి మెండు కోదండరామ్ మాట్లాడుతూ గత 18 నెలలుగా బకాయి ఉన్న వేతన సవరణ, సిబ్బంది నియామకాలు తదితర సమస్యలపై వెంటనే చర్చలకు యూనియన్‌లను పిలవాలని డిమాండ్ చేశారు. తమ సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 10న ఒక గంటపాటు సమ్మె చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు పి.సతీష్, ప్రసాద్, అశోక్, షఫీ, యానాది శెట్టి, బివి.కళ్యాణ్, కాళీ వర ప్రసాద్, బొక్క శ్రీనివాస్, పట్నాయక్, పిఎస్ఎన్.రాజు, శిరీష, రాజకుమారి, మహతి, పాల్గొన్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

నేరాలు ఘోరాలు

యువకుని ఆత్మహత్య

ప్రజాశక్తి-ఉప్పలగుప్తం

ప్రేమించిన యువతి దక్కలేదని మనస్తాపానికి గురై ఉరివేసుకుని యువకుడు ఆత్మహత్య పాల్పడ్డాడు. ఎస్ఐ జి.వెంకటేశ్వర్లు తెలిపిన వివరాలు ఇవి. పెదగాడవిల్లికి చెందిన మందా అనిల్ కుమార్ (22) కాకినాడలోని ఓ ప్రైవేట్ బ్యాంకులో ఉద్యోగం చేస్తున్నాడు. ప్రేమించిన యువతికి బుధవారం పెళ్లి జరుగుతుండడంతో అనిల్ కుమార్ మనస్తాపానికి గురయ్యాడు. అనిల్ కుమార్ బుధవారం తెల్లవారేసరికి ఇంటి మెట్ల ఇనుప దువ్వకు ఉరేసుకుని వేలాడుతూ కనిపించాడు. మృతుని తండ్రి సత్యనారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అమలాపురం ఏరియా ఆసుపత్రికి తరలించి కేసు దర్యాప్తు జరుగుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మద్యం తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి-మండపేట

మండలంలోని మారేడుబాక గ్రామానికి చెందిన పుట్ట శ్రీనివాసరావు గత రెండు రోజుల క్రితం 15 మద్యం సీసాలు తరలిస్తుండగా అతనిని అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు టౌన్ ఎస్ఐ ఎం. అశోక్ తెలిపారు. రాబోయే జనరల్ ఎలక్షన్ సందర్భంగా ఇటువంటి అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే వారిపై కఠిన చర్యలు తీసుకుని రౌడీ షీట్లు తీరుస్తానని పట్టణ సిఐ ఎ.అఖిల్ జమా అన్నారు.

సారా స్వాధీనం : నలుగురు అరెస్ట్

ప్రజాశక్తి-ప్రత్తిపాడు

ప్రత్తిపాడు ఎస్ఇబి అధికారులు పలు గ్రామాల్లో దాడులు నిర్వహించి 120 లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు ఎస్ఇబి సిఐ పి.అశోక్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ప్రత్తిపాడు మండలం లంపకలోవలో పది లీటర్ల సారా స్వాధీనం చేసుకుని ఒక మహిళను, గొనాడలో 20 లీటర్ల సారాతో ఒక వ్యక్తిని, కత్తిపూడిలో 30 లీటర్ల సారాతో ఒక వ్యక్తిని, పది లీటర్ల సారాతో మరో వ్యక్తిని అదుపులోకి తీసుకున్నామన్నారు. అనంతరం కొంతంగి, కొత్తూరులో దాడులు నిర్వహించి పెద్ద ఎత్తున బెల్లపు ఊటను ధ్వంసం చేసి 50 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. పరారీలో ఉన్న ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేశారు. ఈ దాడుల్లో ఎస్ఐలు పి.సునీల్‌కుమార్, బి.శ్రీనివాసరావు, కె.గిరిధర్ సిబ్బంది ఉన్నారు.

సారాతో వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి - నల్లజర్ల

మండలంలోని అనంతపల్లి గ్రామంలో దాడి చేసి ఒక వ్యక్తి దగ్గర ఉన్న 16 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఇబి సిఐ డి.సుధ తెలిపారు. ముందస్తుగా వచ్చిన సమాచారంతో దాడి చేసి గ్రామానికి చెందిన సంకర కిరణ్‌కుమార్ ఇంటిపై దాడి చేసి విక్రయాలకు ఉంచిన సారాను స్వాధీనం చేసుకుని, విక్రయదారుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. ఈ దాడిలో ఎస్ఐ పి.సుధీర్, సిబ్బంది బి.వెంకట్రావులు పాల్గొన్నారు.

బెల్ట్ షాపులపై దాడి

ప్రజాశక్తి - చాగల్లు

మండలంలోని ఉనగట్ల గ్రామంలో అనధికారికంగా నిర్వహిస్తున్న మద్యం బెల్ట్‌షాపులపై పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో నాయుడు కోటేశ్వరరావు కిళ్లీ షాపులో నిల్వ చేసిన 6 బీరులను, అలాగే బొల్ల వరలక్ష్మి దుకాణంలో ఉన్న 5 క్వాటర్ బాటిల్స్‌ను స్వాధీనం చేసుకుని, వారిద్దరిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ కె.సి.హెచ్.రమేష్ తెలిపారు. మండలంలో ఎవరైనా చట్ట విరుద్ధంగా మద్యం విక్రయాలు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మద్యం, సారా విక్రేత అరెస్టు

ప్రజాశక్తి - గోపాలపురం

మండలంలోని తొక్కిరెడ్డిగూడెం గ్రామంలో దాడులు నిర్వహించి 40 లీటర్ల నాటు సారా, 20 మద్యం బాటిల్స్ కలిగి ఉన్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ కె.సతీష్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముందస్తు సమాచారంతో తొక్కిరెడ్డిగూడెం గ్రామంలో ఉన్న మామిడి సత్యనారాయణ ఇంటిపై దాడి చేయగా, ఆ ఇంటిలో 40 లీటర్ల నాటు సారా, 20 మద్యం బాటిల్స్‌ను గుర్తించి స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ కేసులో ముద్దాయిని కోర్టులో హాజరుపర్చినట్లు తెలిపారు.

జూదాలకు పాల్పడితే కఠిన చర్యలు

ప్రజాశక్తి - నల్లజర్ల

సంక్రాంతి పండుగ పేరుతో అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని తహశీల్దార్ వి.కిషోర్ కుమార్ హెచ్చరించారు. బుధవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో ఆయన విలేక రులతో మాట్లాడారు. జూదంతో కూడిన కోడి పందాలు, గుండాటలు, కోసాటలు, పేకా టలు, ఇతర మత్తు పానీయాలకు దూరంగా ఉండాలన్నారు. మండలంలో ఎక్కడైనా కోడి పందాలకు సంబంధించి బరులను ఏర్పాటు చేస్తే తక్షణమే వాటిని ధ్వంసం చేసి సంబం ధిత భూ యజమానులపై చర్యలు తీసుకుం టామని హెచ్చరించారు.

ఇకపై పెన్షన్ రూ.3 వేలు



చెక్కును అందిస్తున్న కలెక్టర్ మాధవీలత

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

ఇకపై జిల్లాలో 8 రకాల పెన్షన్‌దారులకు నెలకు రూ.3 వేలు చొప్పున ఇవ్వడం జరుగుతుందని కలెక్టర్ డాక్టర్ కె.మాధవీ లత తెలిపారు. బుధవారం వైఎస్ఆర్ పెన్షన్ కానుకను రూ.2,750 నుంచి రూ.3 వేలకు పెంచే కార్యక్రమం కాకినాడ రంగరాయ వైద్య కళాశాల మైదానంలో సిఎం జగన్మోహన్ రెడ్డి ప్రారంభించారు. స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత పెన్షన్‌దారులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రస్తుతం 18 రకాల పెన్షన్లు 2,48,083 ఉన్నాయని, వీరందరికీ రూ.73,64,47,000 పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. వీటిలో 8 రకాల పింఛన్లను వృద్ధాప్య, చేనేత, వితంతు, కల్లుగీత, ట్రాన్స్‌జెండర్, మత్స్యకారులు, ఒంటరి మహిళలు, సాంప్రదాయ చర్మకారుల పెన్షన్లను రూ.2750 నుంచి రూ.3 వేలకు పెంచడం జరిగిందని తెలిపారు. జిల్లాలో నూతనంగా మంజూరైన 3962 మందికి రూ.1,18,86,000 లు అందిస్తున్నామన్నారు. జిల్లాలో పెన్షన్ పంపిణీ కార్యక్రమం ప్రజాప్రతినిధుల సమక్షంలో ఈనెల ఒకటో తేదీ నుంచి 6వ తేదీ వరకు ఆయా మండలాలు, మున్సిపాల్టీల్లో అందిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌డిఎ పిడి ఎన్‌వివిఎస్.మూర్తి, లబ్దిదారులు పాల్గొన్నారు.

హోంమంత్రిని కలిసిన డిఐజి



ప్రజాశక్తి - కొవ్వూరు రూరల్

ఏలూరు రేంజ్ డిఐజి స్థాయి నుంచి ఐజిగా పదోన్నతి పొందిన జివిజి.అశోక్ కుమార్ హోంమంత్రి తానేటి వనితను మర్యాదపూర్వకంగా బుధవారం కలిశారు. పదోన్నతి పొందిన అశోక్ కుమార్‌ను హోంమంత్రి అభినందించారు. ఈ కార్యక్రమంలో తూర్పు గోదావరి జిల్లా ఎస్‌పి పి. జగదీష్ పాల్గొన్నారు.

ఇసుక ర్యాంపు వద్ద టిడిపి నిరసన

-రెండు రోజులపాటు మూసివేసిన పోలీసులు



ర్యాంపు వద్ద నిరసనలో చరవాణి ద్వారా అధికారులతో మాట్లాడుతున్న బొడ్డు

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని మునికూడలి గ్రామ పరిధిలో అక్రమ ఇసుక ర్యాంపును నిలుపుదల చేయాలని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ బొడ్డు వెంకటరమణ చౌదరి ఆధ్వర్యంలో టిడిపి శ్రేణులు నిరసనకు దిగాయి. ముందుగా రైతుల భూములను ఆక్రమించి ఇసుకను తరలిస్తున్న ప్రాంతాలను సంబంధిత భూములు గల రైతులతో కలిసి పర్యటించారు. అయితే ఇసుకను తవ్వుతున్న ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సంస్థ ప్రతినిధులతో మాట్లాడారు. ప్రభుత్వం ఇచ్చిన అనుమతి పత్రాలను చూపాలని నిలదీశారు. అయితే ఎంతకూ వారి నుంచి ఎటువంటి స్పందన లేకపోవడంతో ర్యాంపు వద్ద నిరసనకు దిగారు. దీంతో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ లక్ష్మి, సిఐ ఉమామహేశ్వరరావు, ఎస్ఐ చిరంజీవి సిబ్బందితో ర్యాంపు వద్దకు చేరుకున్నారు. నిరసనను విరమించాలని కోరారు. ఈ సందర్భంగా వెంకట రమణ చౌదరి మాట్లాడుతూ ఎటువంటి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న సంస్థపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వారికి వచ్చిన అనుమతి పత్రాలు చూపించే వరకూ తవ్వకాలను నిలుపుల చేయాలని పోలీసు అధికారులకు ఫిర్యాదు చేశారు. తవ్వకాలు నిలుపుదల చేస్తేనే నిరసనను విరమిస్తామని పోలీసులకు ఆయన స్పష్టం చేశారు. మధ్యాహ్నం నుంచి రాత్రి వరకూ నిరసన కార్యక్రమం కొనసాగింది. అయితే పోలీసుల, రెవెన్యూ అధికారుల ఆదేశాలతో రెండు రోజుల వరకూ తవ్వకాలు నిలిపివేయడంతో టిడిపి శ్రేణులు నిరసనను విరమించారు.

యానాం వార్తలు

యానాంలో కేంద్ర మంత్రుల పర్యటన



చెక్కును అందిస్తున్న కేంద్ర మంత్రులు

ప్రజాశక్తి - యానాం

కేంద్ర మత్స్య, పశుసంవర్ధక శాఖ మంత్రి పరుషోత్తమ్ రూపాల, కేంద్ర సహాయ మంత్రి ఎల్.మురుగన్ బుధవారం యానాంలో పర్యటించారు. తొలుత స్థానిక అతిథి గృహం వద్ద ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్, ఆర్ఎఒ మునిస్వామి కేంద్ర మంత్రులకు ఘనస్వాగతం పలికారు. సాగర్ పరిక్రమ కార్యక్రమంలో భాగంగా స్థానిక సావిత్రి నగర్, గిరియంపేట ఫిషింగ్ హార్బర్ వద్ద మత్స్యశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రజా వేదిక కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. మత్స్యశాఖ అధికారులు వారిని ఘనంగా సత్కరించారు. కేంద్ర మంత్రులు మత్స్యకారులతో ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కేంద్రమంత్రి పరిశోత్తం రూపాల మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం మత్స్యకారులకు అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మత్స్యశాఖ జాయింట్ సెక్రెటరీ నీతూ కుమారి మాట్లాడుతూ ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకం అవగాహన చేసుకుని లబ్ధి పొందాలన్నారు. ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ మాట్లాడుతూ మత్స్యకారుల సమస్యలు కేంద్ర మంత్రులకు వివరించి త్వరలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఒఎన్‌జిసి నష్టపరిహారం కూడా త్వరలో అందజేస్తామని తెలిపారు. అనంతరం లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో యానాం మత్స్యశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డి.గొంతియ్య, మత్స్యకార నాయకులు, యువకులు పాల్గొన్నారు.

వేతనాల కోసం ఆసుపత్రి సిబ్బంది ధర్నా



జీతాలు చెల్లించాలంటూ ధర్నా చేస్తు మెడికల్ సిబ్బంది

ప్రజాశక్తి - యానాం

యానాం ప్రభుత్వాసుపత్రిలో ఔట్సోర్సింగ్‌లో పని చేస్తున్న 42 మంది సిబ్బందికి 46 నెలలగా ప్రభుత్వం జీతాలు అందించక పోవడంతో బుధవారం ఉదయం ఆందోళన చేశారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి తమకు బకాయి వేతనాలు చెల్లించాలని కోరుతూ స్థానిక ప్రభుత్వాసుపత్రి ప్రాంగణంలో నినాదాలు చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో 46 నెలలుగా వేతనాలు అందించక పోవడంతో అనేకపరమైన ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటూన్నామని, తమ పిల్లలకు స్కూల్ పీజులు కట్టక పాఠశాలలో బయటకు పంపిస్తున్నారని, అద్దె ఇళ్లలో నుంచి రోడ్డు మీదకు పంపేస్తున్నారని, పండుగ పూట పస్తులు ఉంటున్నామని అనేక ఆర్థికపరమైన ఇబ్బందులు ఎదుర్కొంటూ విధులకు ఆటంకం కలిగించకుండా కరోనా సమయంలో సైతం ప్రాణాలను పణంగా పెట్టి పని చేసామని తెలిపారు. అయినప్పటికీ ప్రభుత్వం స్పందించకపోవడం దారుణం అన్నారు. తక్షణమే తమకు వేతనాలు అందించే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని సిబ్బంది కోరారు. ఉదయం నుండి సాయంత్రం వరకు ఆందోళన చేశారు. వీరికి పలువురు సంఘీభావం తెలిపారు.

ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను పాటించాలి


ఏర్పాట్లును పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్‌పి, జెసి

ప్రజాశక్తి - రాజానగరం

ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారిని డాక్టర్ కె.మాధవీలత అన్నారు. ఆదికవి నన్నయ్య విశ్వవిద్యాలయంలో ఎన్నికలకు సంబంధించిన ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్లు (ఇవిఎం)లు ఉన్న స్ట్రాంగ్ రూమ్‌ను జిల్లా ఎస్‌పి పి.జగదీష్‌తో కలిసి కలెక్టర్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లాలో ఏడు నియోజకవర్గాల నుంచి ఇవిఎంలకు ఏఏ గదులు కేటాయింపులు చేయాలి? వివి ప్యాట్‌లు భద్రపరుచు స్ట్రాంగ్ రూంలకు సంబంధించి రూట్ మ్యాప్, భద్రత అంశాలపై చర్చించారు. మూడు అంచెల భద్రతను పరిశీలించారు. ఈ పర్యటనలో జెసి ఎన్.తేజ్‌భరత్, ఆర్ఎంసి కమిషనర్ కె.దినేష్ కుమార్, కొవ్వూరు సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ్, డిఆర్ఒ జి.నరసింహులు, ఆర్‌డిఒ ఎ.చైత్ర వర్షిణి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

బాలోత్సవానికి ఎంపీ భరత్‌కి ఆహ్వానం


బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపి భరత్

ప్రజాశక్తి - దేవరపల్లి

దేవరపల్లి మం డల రెండవ బాలోత్సవంలో పాల్గొనాలని ఎంపి మార్గాని భరత్ రామ్‌ను ఆహ్వానిం చారు. ఈ సంద ర్భంగా మండల బాలోత్సవ కమిటీ అధ్యక్షులు మరియు రాష్ట్ర మానవత కన్వీనర్ బలుసు సత్యనారాయణ ఎంపితో మాట్లాడుతూ విద్యార్థులలో దేశభక్తి, సేవా భావం, కళల పట్ల ఆసక్తి పెరుగాలనే ఉద్దేశ్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వివరించారు. విద్యార్థుల్లో దాగివున్న సృజనాత్మకతను వెలికితీసే బాలోత్సవంలో మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొంటారని తెలిపారు. ఎంపిని కలిసిన వారిలో కమిటీ సభ్యులు నల్లమాటి రామారావు, కరుటూరి పానయ్య, కె.శివరాంప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

సెంటర్ల నుంచి సరుకులు ఇప్పించండి


తహశీల్దార్‌తో మాట్లాడుతున్న ఉపాధ్యాయులు

ప్రజాశక్తి - కడియం

అంగన్‌వాడీ సెంటర్ల విద్యార్థులకు భోజనం సరఫరా చేస్తున్న పాఠశాలలకు సరుకులు అందించాలని పలువురు ఉపాధ్యాయులు తహశీల్దార్ ఎం.సుజాతను కోరారు. మండలంలోని పలు పాఠశాలలకు చెందిన హెచ్‌ఎంలు ఎంఇఒలు వి.లజపతిరాయ్, వై.నాగేశ్వరరావులతో కలిసి బుధవారం తహశీల్దార్‌ను కలిశారు. తమ పాఠశాలల నుంచి అంగన్‌వాడీ సెంటర్లలో విద్యార్థులకు భోజనాలు సరఫరా చేస్తున్నామని, అందుకు అయ్యే సరుకులను అందించాలని కోరారు. దీనిపై తహశీల్దార్ మాట్లాడుతూ ఇప్పటికే ఆయా పాఠశాలలకు అంగన్‌వాడీ సెంటర్ల నుంచి సరుకులను సరఫరా చేయాలని విఒలను ఆదేశించడం జరిగిందని, ఇప్పటికే కొన్ని పాఠశాలలకు ఇస్తున్నారని, ఎవ్వరికైనా ఆ సరుకులు అందకపోతే సంబంధిత విఆర్ఒలను సంప్రదించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ నాయకులు జయరాజు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సావిత్రిబాయి పూలేకి ఘన నివాళి


తాళ్లపూడిలో సావిత్రిబాయి పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న విద్యార్థులు

ప్రజాశక్తి - తాళ్లపూడి, దేవరపల్లి

భారతదేశ మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. బుధవారం రాగోలపల్లి పాఠశాల ఆవరణలో సావిత్రిబాయి చిత్రపటానికి పూల మాలలు వేసి విద్యార్థులు, ఉపాధ్యాయులు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం దున్నా దుర్గారావు సావిత్రిబాయి జీవిత విశేషాలను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు. అలాగే దేవరపల్లి మండలం.గౌరీపట్నం అంబేద్కర్ సెంటర్ వద్ద రాజ్యాంగ పరిరక్షణ వేదిక కుండా వినయ్ విజేయ్ ఆధ్వర్యంలో సావిత్రి భాయి పూలే జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపి, యుపి స్కూల్ ఉపాధ్యాయులు సావిత్రి బాయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎంలు నర్సమ్మ, ఆంజనేయులు, ఉపాధ్యాయరాలు రమాదేవి, సిఐటియు నాయకురాలు కుమారి పాల్గొన్నారు.

వెంకటేశ్వర స్వామి ఆలయంలో పూజలు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

ధవలేశ్వరంలోని స్థానిక వెంకటేశ్వర స్వామి ఆలయంలో బుధవారం ఘనంగా లక్షి తులసి పూజ చేశారు. పళ్ల రసాలతో అభిషేకాలు, అలంకరణ, అర్చన, హారతి, లక్ష తులసి, హోమం, దర్పణం, పూర్ణాహుతి కార్యక్రమాలను నిర్వహించారు. ఆలయ అర్చకులు అనంత వల్లభాచార్యులు ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు జరిగాయి. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకురాలు జక్కంపూడి విజయలక్ష్మి ఆలయ మాజీ ఛైర్మన్ సాధనాల .చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు చర్యలు

ప్రజాశక్తి - గోపాలపురం

ప్రమాదాలు నివారించేందుకు ప్రమాదకర ప్రదేశాలలో వాహనాల వేగాన్ని తగ్గించేందుకు రేడియం డ్రమ్ములను ఏర్పాటు చేసినట్లు సిఐ అనసూరి శ్రీనివాసరావు, ఎస్ఐ కె.సతీష్ కుమార్ తెలిపారు. పలు ప్రాంతాల్లో రేడియం స్టిక్కరింగ్ డ్రమ్ములను బుధవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జాతీయ రహదారుల్లో ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయని, వీటిని నివారించేందుకు పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాలతో బ్లాక్ స్పాట్స్‌ను గుర్తించి రేడియం స్టిక్కరింగ్ డ్రమ్ములను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. వాహనాలు నడిపేటప్పుడు ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటించాలని కోరారు.

ఇవిఎంలపై అవగాహన



ప్రజాశక్తి - తాళ్లపూడి

ఇవిఎంల వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించారు. స్థానిక గ్రామ సచివా లయం ఇవిఎంలపై అవగాహన కార్యక్రమాన్ని బుధ వారం నిర్వహించారు. ఈ సంద ర్భంగా ఎంపి డిఒ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ అమ్మిరాజు ఇవిఎం యొక్క ఆవశ్యకతపై వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి ఆశా అలేఖ్య, సచివాలయం సిబ్బంది, బూత్ అధికారులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట

ప్రజాశక్తి - నిడదవోలు

పేదల సంక్షేమానికి ప్రభుత్వం పెద్ద పీట వేస్తుందని మండల వైసిపి అధ్యక్షుడు అయినీడు పల్లారావు అన్నారు. పింఛన్‌ను రూ.3 వేలు పెంచిన నేపథ్యంలో బుధవారం లబ్దిదారులకు తిమ్మరాజుపాలెం రైతు భరోసా కేంద్రంలో సర్పంచ్ ముప్పిడి చంద్రశేఖర్ అధ్యక్షతన సభలో పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రావిమెట్ల సొసైటీ అధ్యక్షులు యాళ్ళ రామారావు, కార్యదర్శి కెవి.సుబ్బన్న, తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం


క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న బూరుగుపల్లి

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

మండలంలోని వేలివెన్ను శశి విద్యాసంస్థల ప్రాంగణంలో శశిధర్ మెమోరియల్ సంక్రాంతి సంబరాల్లో భాగంగా క్రికెట్ టోర్నమెంటు పోటీలను ప్రారంభం అయ్యాయి. ఈ పోటీలను బుధవారం మాజీ ఎంఎల్ఎ, టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ బూరుగుపల్లి శేషారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా సంక్రాంతి సంబరాల కన్వీనర్, గ్రామ ఉప సర్పంచ్ బూరుగుపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ నిడదవోలు నియోజకవర్గ స్థాయిలో 56 జట్ల పాల్గొంటున్నాయని తెలిపారు.

పేదలకు దుస్తుల పంపిణీ


దుస్తులు పంపిణీ చేస్తున్న పాస్టర్

ప్రజాశక్తి - నల్లజర్ల

మదర్ థెరిసా జ్ఞాపకార్థం మండలంలోని జగన్నాథపురం గ్రామంలో పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. తొలుతగా మదర్ థెరిసా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బోదేపల్లి శ్రీను, సుబ్బమ్మ ఆర్థిక సహాయంతో సర్పంచ్ చల్లారి రామశ్రీనివాస్ చేతుల మీదుగా పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఫాదర్ జయరాజ్ మాట్లాడుతూ ప్రపంచంలోనే అత్యంత ప్రేమా మూర్తిగా మదర్ థెరిసా గుర్తింపును పొందారని అన్నారు. ఈ కార్యక్రమంలో మద్దిపాటి ప్రసాద్, మేడంకుల మధు, నూకపెయ్యి రెడ్డియ్య, కళ్లెం మహేష్, మారుబోయిన యేసు, తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులు ఉన్నతంగా రాణించాలి

ప్రజాశక్తి - తాళ్లపూడి

ప్రతి క్రీడాకారుడు ఉన్నతంగా రాణించాలని ఎంపిపి జొన్నకూటి పోసిరాజు పిలుపునిచ్చారు. ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీల్లో భాగంగా బుధవారం ఎంపిడిఒ కార్యాలయంలో క్రీడాకారులకు క్రీడా పరికరాలు, టోపీలు, దుస్తులను బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల స్థాయి నుంచి జిల్లా,రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ప్రతిభను కనబరిచి గ్రామానికి మంచి పేరుతో తీసుకురావాలని కోరారు. అందుకు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ప్రోత్సహించాలన్నారు. విజయాలను సాధిస్తూ ఉన్నత శిఖరాలకు చేరుకునే పుట్టిన ఊరికి గురువులకు తల్లిదండ్రులకు పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని ఎంపీపీ జొన్నకూటి పోసిరాజు సూచించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, పిఇటిలు పాల్గొన్నారు.

'రాబోయేది టిడిపి ప్రభుత్వమే'


ర్యాలీగా వస్తున్న మాజీ ఎంఎల్ఎ జ్యోతుల

ప్రజాశక్తి - గోకవరం

రానున్న సార్వత్రిక ఎన్నికల్లో విజయం సాధించేది తెలుగుదేశం పార్టీయేనని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు జ్యోతుల నెహ్రూ అన్నారు. స్థానిక సూర్య ఫంక్షన్ హాల్లో వైసిపికి చెందిన పలువురు టిడిపిలో చేరారు. ఈ సందర్భంగా స్థానిక పంచాయితీ కార్యాలయం నుంచి ఫంక్షన్ హాలు వరకూ భారీ ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా సొసైటీ మాజీ అధ్యక్షులు దాసరి తమ్మన దొర, ఆయన మనవుడు తరుణ్ ఆధ్వర్యంలో వైసిపి నుంచి చేరిన కార్యకర్తలకు జ్యోతుల నెహ్రూ పార్టీ కండువాలను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం సైకో జగన్ పరిపాలన పట్ల ప్రజలు పూర్తిగా విసుగు చెందారని, రానున్న ఎన్నికల్లో ప్రజలంతా టిడిపికి ఓటు వేసి వైసిపిని గద్దె దింపడానికి ప్రజల సిద్ధంగా ఉన్నారన్నారు. రానున్న కాలంలో టిడిపి విజయం సాధించడం ఖాయమని అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ ఎం..రామకృష్ణ, కన్నబాబు, ఉంగరాల రాము, పి.బోసు బాబు, పాల్గొన్నారు.